# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

epaper.manachourasta.com

సంపుటి : 01 | సంచిక : 110 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 19 మార్చి 2026 | పేజీలు : 5




ఉగాది వేళ.. కవితా సంకలనం

2లో



ఉష కాలమ్..

## ఉగాది.. వసంత విభావరి..


వసంత విభావరిలో విరిసిన వెలుగుల వేళ,
పచ్చని ప్రకృతి పులకించి నవ్విన వేళ,
గడపల గర్భగృహమున మంగళ స్వరమై
తెలుగు తల్లి పండుగగా ఉగాది అవతరించె.
మామిడి తొరణాల పచ్చని తంతువులలో
ఆశల అలలు అలరిస్తూ ఊగుచుండగా,
వేప పుష్పాల చేదు గర్భిత గంధములో
జీవన సత్యాల గూఢార్థం మౌనమై నిలిచె.
కోకిల కూయు కంఠమున కలకల రాగములు
ప్రకృతి మంగళ ధ్వనులై పరిమళించగా,
వసంత సమీర మృదుస్పర్శ సన్నిధిలో
నూతన సంవత్సర స్వప్నాలు సుస్వాగతించె.
మామిడి-వేపల మేళన రసమూర్తిగా
ఉగాది పచ్చడి రూపమై వెలిసిన వేళ,
చేదు-తీపి-పులుపు-కారం-ఉప్పుల రుచులలో
జీవిత చక్రం సత్యమై ప్రతిధ్వనించె.
సంస్కృతి సుమములు వికసించు వేళ,
సంప్రదాయ దీపములు ప్రకాశించు వేళ,
ప్రకృతి-మనుజ బంధమది పావనమై
భూమి ఒడిలో నిత్యమై నిలిచియుండె.
అందుకే ప్రతి ఉగాది ప్రబోధమై,
పచ్చని మామిడి పుటల పలుకులలో,
వేప పుష్ప సుగంధ విరిసిన వేళ,
కోకిల గానామృత తరంగములలో,
ప్రకృతి సాక్షిగా మన జీవన గాథకు
కొత్త ఆది - కొత్త ఆశ - కొత్త మార్గమై నిలిచె.



- మంజుల పత్తిపాటి, యాదాద్రి
భువనగిరి జిల్లా, 9347042218

## షడ్రుచుల ఉగాది

ఉగాది ఉషస్సు
కోరుతుంది మన శ్రేయస్సు
మామిడి పుతతో
కోయిల కూతతో
వేపపువ్వు పుతతో
కొత్త ఆశలు చిగురింప చేస్తూ
కొత్త ఊహలకి ఊపిరి పోస్తూ
విరజింప చేస్తుంది ఈ ఉగాది
షడ్రుచుల అభిరుచులతో
ప్రకృతి వలయంలో దొరికే
పదార్థాలతో తయారు చేసే పచ్చడి
మన జిహ్వకి రుచుల పండుగ ఈ ఉగాది
పంచాంగ శ్రవణం
చెవులారా వినసొంపుగా ఉంటుంది
శ్రీ పరాభవ నామ సంవత్సర
చైత్రమాస ఆరంభం
తెలుగింటి ప్రజల ఆనందం
ఉగాది శుభాకాంక్షలతో..




- మల్యాల జనార్ధన చారి
పెంబర్తి, 9000585101



## గత ఉగాది – నేటి ఉగాది

గత ఉగాది..
మామిడి తోరణాల మధ్య
అమ్మ పచ్చడి రుచిలో
మనసంతా పండుగైపోయిన రోజులు..
బంధువుల నవ్వుల్లో
పక్కింటి పలకరింపుల్లో
సాధారణంలోనే
అసాధారణ ఆనందం..
నేటి ఉగాది..
స్క్రీన్‌ల వెలుగుల్లో
వాట్సాప్ శుభాకాంక్షల్లో
సెల్ఫీల్లో నిలిచిన సంబరాలు..
రుచులు మారినా,
పద్ధతులు మారినా..
మనసుల దగ్గరితనం
మారకూడదు..
గతం నేర్పిన విలువలతో
నేటిని అందంగా మార్చుకుందాం..



- గడ్డం మనోజ్ కుమార్,
జరసం ప్రధాన కార్యదర్శి

## పేరుకే పరాభవ నామ ఉగాది

మోదుగ కొమ్మల ఎర్రనిపూలు
వేప చెట్టు తెల్లని పూత
మామిడికాయల పచ్చని కాత

గాలి మీటిన రాగి
ఆకుల సవ్వడులు
కోయిల రాగాల
వసంతకాలపు పరవళ్లు

గుమ్మం తలపై
మామిడాకుల చల్లదనం
మండే ఎండల్లో నిరుపేద
ఆశల పచ్చదనం

అమ్మచేతి అరురుచుల వంట
జీవితపు ఒడిదుడుకుల్లో
ధైర్య సాహసాల పంట

కురవాలి పల్లె పల్లెనా
సిరుల జల్లు
రైతన్న మదిలో
ఆనందాల హరివిల్లు

పేరుకే పరాభవనామ ఉగాది
వసంతం కావాలి అపజయం
ఎరుగని విజయాల పునాది



- పెట్లోజు సోమేశ్వరాచారి,
వ్యవస్థాపక అధ్యక్షులు
కవి హృదయం సాహిత్య వేదిక, జనగామ

## ఉగాది.. కేళి

లేత చిగుర్లు
మామిడి పిందెల వగరులు
కోయిల కూతల పొగరులు
కొత్త చింతకాయ పులుపు
వేప పూల గుపాలింపు
మోదుగ ఆకుల వాసనలు
పచ్చని పక్శతి వసంతం
ఉగాది కేళి కి సంకేతం
వచ్చిన ఉగాది ఊరికే రాదు
కొత్త బట్టలతో
కోలాహం తెస్తుంది

ఇల్లు అంతా సందడి చేస్తుంది
పిల్లాపాపల కేరింతలతో
ఇల్లంతా ఊరంతా పండగే
కొత్తకొండలో చల్ల నీళ్లు
తీపి బెల్లం వేప చేదు
చింత పులుపు
మామిడి వగరు
ఉప్పు కారం తోడుగా
షడ్ రుచుల పచ్చడి
జీవిత సారం చెబుతుంది
ఆశలు ఆశయాలు
కొత్త ఆలోచనలు కొత్త పనులు
ఎదగడం మొదలవుతుంది
ఉగాది తోనే...

ఆశల పల్లకిలో
ఊగిసిలాడే మనిషి
స్వార్థం వీడి
మనిషి మనిషిని
అన్నింటికంటే గొప్ప ఆస్తిగా
పరిగణించే రోజు రావాలి

రక్త బంధాలు
కుటుంబ బంధాలు
స్నేహ బంధాలు
మానవ సంబంధాలు
అన్ని సంబంధాలు బలపడాలి
మనిషిలో మానవత్వం
మళ్లీ వికసించాలి
ఈ ఉగాది కేళి మనుషుల జీవితాల్లో
రంగుల కేళి కావాలి.



- మామిండ్ల అంజయ్య,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు
జనగామ జిల్లా, 9542700333

# మైనార్టీల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి

- **మంత్రి కొండా సురేఖ**



**వరంగల్, మన చౌరాస్తా :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌బి నగర్‌లోని ఏ1 ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన దావతే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖోస్రో పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఉపవాస దీక్ష విరమణ సందర్భంగా పండ్లు అందజేశారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇఫ్తార్ విందు వంటి కార్యక్రమాలు పరస్పర సౌహార్దాన్ని పెంపొందిస్తూ సమాజంలో ఐక్యతను బలపరుస్తాయని మంత్రి తెలిపారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసి పండుగలను జరుపుకోవడం భారతీయ సంస్కృతికి ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందుకు కేటాయించిన నిధులను స్థానిక ఇమాములు, మౌజంలకు అందజేసి, అదేవిధంగా, తన స్వంత ఖర్చులతో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాజీ ఎంఎల్సీ కొండా మురళీధర్ రావు సోదరభావాన్ని చాటుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఈద్గాల అభివృద్ధికి రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రి కొండా సురేఖకు స్థానిక కార్పొరేటర్ ఫుర్ఖాన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ఆర్డీవో సుమ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, డీపీఆర్వో ఆయుబ్ అలీ, తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.





# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకుముందు పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని లింగాల ఘణపురం మండలంలోని నెల్లుట్ల పంచాయతీ పరిధిలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, అలాగే దేవరుప్పుల మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, హాజరు వివరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశ్నపత్రాల పంపిణీ విధానం, పర్యవేక్షణ ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నపత్రాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.



విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా సరి చూసుకోవాలని సూచించారు. పరీక్ష తరగతి గదుల్లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు సరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి విధుల్లో బాధ్యతగా ఉండాలని తెలిపారు. అదే విధంగా దేవరుప్పుల మండల కేంద్ర పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఔషధాల నిల్వలు, వైద్యులు, నర్సుల హాజరు రిజిస్టర్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందరూ అందుబాటులో ఉన్నారా? టీకాలు సరిగా వేస్తున్నారా? రోగులకు సరైన చికిత్స అందిస్తున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, శిశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు, అవసరమైన అన్ని మందులు నిల్వలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవలు మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.

# మంత్రి దామోదరను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హైదరాబాద్ లో సమావేశమయ్యారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సదుపాయాల అభివృద్ధి దిశగా తీసుకోవాల్సిన చర్యలను ఆమె మంత్రికి వివరించారు. ఏడు పడకలుగా ఉన్న కొడకండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పెరుగుతున్న రోగులు బాధితుల దృశ్య 30 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలని కోరారు. ఇతరత్రా అంశాలతో పాటు విజ్ఞప్తిని మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ దిశగా చర్యలు చేపట్టిందన్నారు.





# బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** పాలకుర్తి మండలం వల్మిడి గ్రామం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పైన బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, సంబంధిత అధికారులతో మినీ కాన్ఫరెన్స్ హల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలని, ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో గల ఏర్పాట్లన్ని పక్కాగా చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారంగా సీటింగ్ ఏర్పాట్లు ఉండాలని, విద్యుత్ సరఫరా లో ఆటంకం ఉండకూడదని, ట్రాఫిక్, క్యూ లైన్, పార్కింగ్ తదితర అంశాల్లో భక్తుల కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వామి వారి దర్శనం సులభం గా దర్శనం చేసుకొని వెళ్లేలా పోలీస్ బందో బస్తు ఉండాలని , త్రాగు నీటి కోసం మంచి నీళ్ల ట్యాంకర్ లని, మెడికల్ క్యాంపు ని ఏర్పాటు చేయాలనీ , అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, భక్తుల రాకపోకల కు ఇబ్బంది లేకుండా సరిపడా బస్సులను ఆర్టీసీ వారు అందుబాటులో పెట్టాలని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అవసరమైన చోట రోడ్ మరమ్మత్తులు చేయాలనీ, NSS వాలంటీర్ లను పంపించాలని, ఫైర్ వెహికిల్ కూడా అందుబాటులో పెట్టాలని, శానిటేషన్ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులు, భోజనాలను చెక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీ వో వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఆలయ ఈఓ, పాలకుర్తి తహసీల్దార్, విద్యుత్, వైద్య, పంచాయతీ రాజ్, పోలీస్, ఆర్టీసీ, ఫైర్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చౌడారం జడ్పీహెచ్ఎస్‌లో ముందస్తు ఉగాది



**జనగామ రూరల్ , మన చౌరాస్తా :** జనగామ మండలం చౌడారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టత, పచ్చడి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులతో షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేయించి అందరూ కలిసి ఆస్వాదించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీధర్, మంజుల, వేణుగోపాల్, బాలమల్లయ్య, రత్నాదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కంకినల్లి నివారణపై అప్రమత్తత అవసరం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండా గ్రామంలో బుధవారం వరి పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డా. పి. గోన్యా నాయక్, డా. పద్మజ, హనుమకొండ డివిజన్ ఏ.డి.ఏ ఆది రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పద్మ కలిసి విస్తృతంగా పరిశీలించారు. రైతుల పంట స్థితిగతులను తెలుసుకుంటూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వరి పొలాలలో కంకినల్లి పురుగు ప్రభావం ప్రారంభ దశలోనే ఉన్నట్లు గుర్తించారు. ఇది త్వరగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా పొలాలలో తేమ, వాతావరణ మార్పులు పురుగు విస్తరణకు కారణమవుతాయని పేర్కొన్నారు. దాని నివారణకు వర్షాలు తగ్గిన వెంటనే తగిన పురుగుమందులను సూచించిన మోతాదులో పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అలాగే పంటను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రారంభ దశలోనే పురుగును నియంత్రించడం వల్ల దిగుబడి నష్టాన్ని నివారించవచ్చని వివరించారు. రైతులు తమ పొలాలలో ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పిస్తూ పంట సంరక్షణపై శాస్త్రీయ పద్ధతులు పాటించాలని తెలిపారు. ఇంకా పది రోజుల తర్వాత మళ్లీ గ్రామానికి వచ్చి వరి పొలాలను పరిశీలించి తదుపరి సూచనలు అందిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుకనూరు సంఘ వ్యవసాయ అధికారులు అచ్యూత రెడ్డి, స్వామి రావు, ప్రాశాంత్, గ్రామ సర్పంచ్ గుగ్లోతు పూర్ణతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మట్టి పాత్రలు అందజేసిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి కుల వృత్తులను ప్రోత్సహించండి" నినాదంతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గార్లకు ఉగాది మట్టి పాత్రలను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.. అందులో ఉగాది పండగ కి ఉపయోగపడే మట్టి కుండా, గ్లాస్ లు , జగ్గు ,బౌల్, షడ్రుచులు ఉండే మామిడి కాయలు , వేప పువ్వు , బెల్లం , చింతపండు ,కారం వస్తువులు ఉగాది కిట్ లో అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రలు ఉపయోగించాలని , ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మన సంస్కృతి సంప్రదాయాలకు పండగలతో మట్టి పాత్రలు అనువైనవనని మంత్రి పొన్నం ప్రభాకర్ మట్టి పాత్రలు వినియోగాన్ని పెంచి కుల వృత్తులను కాపాడడానికి అందజేశారని వారు పేర్కొన్నారు. మట్టి పాత్రలు వాడకం తరతరాల సంప్రదాయం.. దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయనీ ఉగాది సందర్భంగా మట్టి పాత్రలు వాడండి ,కుల వృత్తులను కాపాడండి .. ఆరోగ్యాన్ని రక్షించుకోండి అనే నినాదంతో పండగ జరుపుకోవాలని సూచించారు.

# కవి ఓదెల నరేష్‌కు పురస్కారం

**కరీంనగర్, మన చౌరాస్తా :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన వికలాంగ కవి ఓదెల నరేష్ ఉగాది సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో ప్రతిభ కనబరిచి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని స్వీకరించారు. 2011 సంవత్సరం నుంచి కవితలు రాస్తూ వస్తున్న నరేష్ తన సాహిత్య ప్రతిభతో గుర్తింపు పొందారు. లయన్స్ ఇంటర్నేషనల్, సమైక్య సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో తన కవితలను ప్రదర్శించి ఈ గౌరవాన్ని అందుకున్నారు. తన ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, ప్రత్యేక కేసు కింద ఉద్యోగావకాశం కల్పించాలని నరేష్ కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, రీజియన్ చైర్మన్ గాలిపల్లి వెంకట్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్. అనంతాచార్య, ప్రొఫెసర్ డాక్టర్ అడువాల సుజాతతో పాటు పలువురు కవులు పాల్గొన్నారు.






# ఈద్ కా తోఫాల పంపిణీ

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఈద్ కా తోఫా" కార్యక్రమం భీమదేవరపల్లి మండలంలో ఘనంగా నిర్వహించబడింది. మండలంలోని అన్ని గ్రామాల ముస్లిం సోదర సోదరీమణులకు, వారి కుటుంబాలకు ఒక చీర, ఒక పైజామా, పిల్లలకు డ్రెస్సు మెటీరియల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలయ్య, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్, యూత్ వైస్ ప్రెసిడెంట్ చిటుకూరి అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా పండుగ ఆనందాన్ని పేద మరియు అవసరమైన కుటుంబాలకు చేరవేయడమే లక్ష్యంగా ఉందని నాయకులు తెలిపారు.



# కోహెడలో ఘనంగా ఇఫ్తార్ విందు

**కోహెడ, మన చౌరాస్తా :** కోహెడ మండల కేంద్రంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గవ్వ వంశీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందదాయకమని తెలిపారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి, స్నేహభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ట్రస్ట్ ద్వారా సామాజిక, విద్యా, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరింత సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం ముస్లిం మైనార్టీ సోదరులు వంశీధర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలస సుభాష్ చంద్రబోస్ నేత, గుగ్గిళ్ళ కార్తీక్, యువసేన అధ్యక్షుడు ఎండీ ఒవైస్, అబ్దుల్ రఫీ, తుఫాన్, శంషీర్, జాలిగాం శంకర్, మహమ్మద్ జాకీర్, మీర్జా ఆసిఫ్, జావిద్, షరీఫ్, మీర్జా అర్షద్, అక్తర్ పాషా, సమీర్, పోలవేణి కుమారస్వామి, గోవిందు వెంకటేశం, మహమ్మద్ సైఫుద్దీన్, కల్లికోట రాహుల్, జాలిగం అజయ్, ఇలియాస్, ఆరీఫ్, షోయబ్ పాల్గొన్నారు.

# ఎన్పీడీసీఎల్ సీఎండీకి మాజీ ఎమ్మెల్యేల వినతి

**హన్మకొండ, మన చౌరాస్తా :** హన్మకొండ హంటర్ రోడ్‌లోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు భవనానికి విద్యుత్ శాఖ అధికారులు విధించిన అపరాధ రుసుమును రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు ఎన్పీడీసీఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ మాజీ మేయర్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ బోర్డు చైర్మన్ వన్నాల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ట్రస్ట్ బోర్డు ముఖ్య సలహాదారు, సీనియర్ జర్నలిస్ట్ వేముల సదానందం కలిసి విజ్ఞప్తి చేశారు. గత పది సంవత్సరాలుగా చేనేత కార్మికుల పిల్లల ఉన్నత విద్యకు తోడ్పడే ఉద్దేశంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో బీసీ నేత విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు వారు వివరించారు. భవనానికి సంబంధించిన విద్యుత్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అకారణంగా రూ.73,745 అపరాధ రుసుము విధించారని పేర్కొన్నారు.



దాతల సహాయంతో నడుస్తున్న బీసీ నేత హాస్టల్ ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ జరిమానా మరింత భారంగా మారిందని తెలిపారు. అందువల్ల విధించిన అపరాధ రుసుమును వెంటనే రద్దు చేయాలని వారు కోరారు.

# బాధిత కుటుంబానికి మంత్రి సాయం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన సంగ రాజయ్య ఇటీవల పురుగుమందు సేవించడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను నిమ్స్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) నుండి రూ.2,50,000 ఎల్.ఓ.సి మంజూరు చేసి ఆర్థిక సహాయం అందించారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయానికి గట్లనర్సింగాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బాధితుడి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# రైతు సమస్యలపై ఐక్యంగా పోరాడాలి




**చేర్యాల, మన చౌరాస్తా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక కార్పొరేట్ విధానాలపై రైతులంతా ఐక్యమై పోరాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున చేర్యాల మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో తెలంగాణ రైతు సంఘం మండల, పట్టణ 4వ మహాసభలు మోకు దేవేందర్ రెడ్డి, ఆముదాల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్ మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న ఇరాన్ పై యుద్ధం కారణంగా భారతదేశ రైతాంగం, సాధారణ ప్రజానీకం అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తున్నదని అమెరికా అధ్యక్షుడు డ్రోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలకు భారత ప్రధాని మోడీ వ్యవహరిస్తున్న తీరు వల్ల నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని భారత దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పడిపోయాయని ఎగుమతులపై పన్నుల భారం విపరీతంగా పెంచి వేయడం అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా భారతదేశంలో దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడి రైతాంగంపై అనేక బారాలు పడుతున్నాయని ఈ విధానాలను తిప్పి కొట్టాలని మరియు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, యూరియా కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం, ఫర్టిలైజరీ యాప్, కాటన్ కపాస్ యాప్ లాంటి టెక్నాలజీ నీ వ్యవసాయ రంగంలో ప్రవేశపెడుతూ ఇక్కడి చిన్న, సన్న కారు రైతులను వ్యవసాయం నుండి వేరు చేసే విధంగా మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఈ విధానాల వల్ల బడా భూస్వాములకు , కార్పొరేటు వ్యవసాయం నిర్వహించే వారికి మేలు జరుగుతుంది తప్ప చిన్న సన్న గారు రైతులకు ఏమాత్రం లాభాలు చేకూరే విధంగా లేవని రాబోయే రోజుల్లో ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్యమై పోరాడాలని పిలువు పిలుపునివ్వడం జరిగింది. అనంతరం తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ టౌన్ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగా కృష్ణారెడ్డి, బెజాడి మల్లారెడ్డి, ఆముదాల నర్సిరెడ్డి ,తుప్పతి రాజు, బోడిగం నర్సిరెడ్డి, నాగపురి కనకయ్య ,కొంగరి చంద్ర మజుందార్, సుర్ణ తిరుపతి, ఎస్ డి ఇబ్రహీం, నంగి మైసయ్య, కందూరు శ్రవణ్, కర్ణాకర్, శ్రీకాంత్, పండుగ యాదగిరి, మోకు ఇంద్రం, కర్రె సత్తయ్య, ఎస్ డి ఇస్మాయిల్, ఆవుల చంద్రయ్య, ఎలా సెంబయ్య ముస్త్యాల ప్రభాకర్, కత్తుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీడీసీటీవీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వినయ్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ డిజిటల్ కేబుల్ టీవీ అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా మరెడి వినయ్ కుమార్ నియమితులయ్యారు. జర్నలిజంలో కొనసాగుతూ తన నేతృత్వంలో రెండు సంవత్సరాల క్రితం ప్రైమ్ 1 న్యూస్ కేబుల్ టివిని స్థాపించి ముందుకు సాగుతున్నారు. ఇటీవల తెలంగాణ డిజిటల్ కేబుల్ టీవీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ప్రకటించిన నేపథ్యంలో జనగామ జిల్లా అధ్యక్షుడిగా మరెడి వినయ్ కుమార్ ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచర్ల గోపి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గోపి జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మరెడి వినయ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలుపుతూ కేబుల్ ఛానల్ వ్యవస్థ లో పనిచేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకి అందాల్సిన పథకాలు అందించే విధంగా కృషి చేయాలని సూచించారు.



# ముల్కనూర్ చెరువు మరమ్మతులకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదన

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మోంతా తుఫాను ప్రభావంతో ధ్వంసమైన ముల్కనూర్ చెరువును ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి తో కలసి బుధవారం ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. చెరువు మరమ్మతుల కోసం సుమారు రూ.1 కోటి 50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియను త్వరలో పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు బ్రిడ్జి నిర్మాణం, అడ్డుగోడ నిర్మాణం, చెరువు కట్ట పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.సంబంధిత కార్యక్రమంలో పలువురు ఇంజినీరింగ్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ ఈ సుమతి దేవి, ఏఈ ఎ. వెంకటకృష్ణ రావు, డి ఏ ఈ కె. శ్రీధర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె. శశిధర్ రెడ్డి, చి. కృష్ణ కాంత్, ఎ. రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



# ముల్కనూర్ పీహెచ్‌సీలో 108 అంబులెన్స్ తనిఖీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌ను హనుమకొండ జిల్లా 108 మేనేజర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనం పనితీరు, అందులోని మెడికల్ ఎక్విప్‌మెంట్ పరిస్థితి, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు నాణ్యమైన ప్రథమ చికిత్స అందిస్తూ, సమయానికి ఆసుపత్రికి తరలించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయాల్లో తప్పనిసరిగా అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి వెళ్లాలని, అంబులెన్స్‌లో డెలివరీకి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ముల్కనూర్ 108 సిబ్బంది పనితీరును ప్రశంసించారు.

# అక్కన్నపేటలో విశ్వకర్మ కిట్ పంపిణీ

**అక్కన్నపేట, మన చౌరస్తా :** అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా విశ్వకర్మ కిట్‌ను బీజేపీ మండల నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం ద్వారా అక్కన్నపేట మండలానికి చెందిన కందుకూరి అరుణాచారి లబ్ధి పొందడం సంతోషకరమని తెలిపారు. ఈ పథకం ద్వారా సంప్రదాయ వృత్తుల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తోందన్నారు. లబ్ధిదారుడు కందుకూరి అరుణాచారి మాట్లాడుతూ, విశ్వకర్మ యోజన కిట్ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా తాము శిక్షణ పొందడంతో పాటు ఆర్థికంగా బలపడే అవకాశమొచ్చిందని చెప్పారు. చేతివృత్తులకు చేయూతనిస్తూ, సంప్రదాయ వృత్తులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, అలాగే కిట్ అందించిన స్థానిక బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మహిళా మోర్చా మాజీ ఉపాధ్యక్షురాలు మేడమైన సరూప, ఎస్టీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్, సంజీవరెడ్డి, జగదీశ్వర్ చారి, పల్లె ప్రభాకర్ రెడ్డి, నేరెళ్ల రమేష్, బొంకురి రజినీకాంత్, గంపల మధు, మిట్టపల్లి సత్యనారాయణ, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రెసెంటేషన్'లో ఘనంగా ఉగాది వేడుకలు




**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల లో ప్రెసెంటేషన్ పాఠశాలలో ఉగాది పండుగను ఉల్లాసంగా, సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉగాది ప్రాధాన్యతపై ప్రసంగంతో పాటు ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు, ఉగాది పచ్చడి రుచిని ఆస్వాదించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి మాట్లాడుతూ, ఉగాది కొత్త సంవత్సరానికి ఆరంభం మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, లక్ష్యాలకు నాంది అని తెలిపారు. విద్యార్థులు తమ జీవితంలో క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**